- చేసిన పనులు చెప్పి ఓట్లు అడిగిన బీఆర్ఎస్ అభ్యర్థులు
- ఐదు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల వైపు ఓటర్ల మొగ్గు
- ప్రలోభాలను నమ్ముకున్న కాంగ్రెస్
- కాంగ్రెస్ అభ్యర్థులు ఓటర్లకు మద్యం, డబ్బు ఎర

# అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా

సంగారెడ్డి నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనున్నది. జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు జరిగే ఎన్నికలపై అందరి దృష్టి నెలకొంది. బీఆర్ఎస్ అభివృద్ధి, సంక్షేమ ఎజెండాతో ప్రజాతీర్పును కోరుతున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఐదుగురు నిజాయితీగా తమ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ఓటర్లకు వివరించారు. అలాగే తమను గెలిపిస్తే వచ్చే ఐదేండ్లలో చేపట్టేబోయ పనులను వివరిస్తూ ఓటర్ల మద్దతు కోరారు. సీఎం కేసీఆర్ దార్శనికత, పాలనా పటిమ, తెలంగాణ అభివృద్ధిపై ఉన్న కమిట్‌మెంట్ చూసి ఓటర్లు ఆయనను హ్యాట్రిక్ సీఎంగా చూడాలని బలంగా కోరుకుంటున్నారు. అదేసమయంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల పనితీరు బాగా ఉండడంతో బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలన్న నిర్ణయానికి ఓటరు వచ్చినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. సర్వేలు సైతం ఇదే విషయాన్ని బలపరుస్తున్నాయి. అయితే బీఆర్ఎస్‌కు భిన్నంగా ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయి. దొడ్డిదారిలోనైనా ఎన్నికల్లో గెలవాలని ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. బీఆర్ఎస్ అభివృద్ధి, సంక్షేమ ఎజెండాతో ఓటరును గెలవాలని చూస్తే కాంగ్రెస్ ప్రలోభాలను నమ్ముకుని గెలవాలన్న కుట్రలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో ఓటర్లకు మద్యం, డబ్బుల ఎరవేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బుధవారం రాత్రి సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్‌చెరు, అందోలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల తరపున వారి అనుచరులు మద్యం, డబ్బులు పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేశారు. అయితే ఓటర్లు కాంగ్రెస్ కుటిల ప్రయత్నాలను తిప్పికొడుతున్నారు.

### అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ నినాదం

బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లాలో ఎనలేని అభివృద్ధి చేసింది. ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసింది. సీఎం కేసీఆర్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఐదు నియోజకవర్గాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తిరిగి అధికారంలోకి వస్తే సంగారెడ్డి జిల్లాలో చేపట్టేబోయే పనులు ఓటర్లకు వివరించి మద్దతు కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు చింతా ప్రభాకర్(సంగారెడ్డి), చంటి క్రాంతికిరణ్(అందోలు), గూడెం మహిపాల్‌రెడ్డి(పటాన్‌చెరు), కొణింటి మాణిక్‌రావు(జహీరాబాద్), మహారెడ్డి భూపాల్‌రెడ్డి (నారాయణఖేడ్) తమ ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గాల్లో చేసిన అభివృద్ధి పనులు వివరించి ఓటర్ల మద్దతు కోరారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మెడికల్ కాలేజీ కలను బీఆర్ఎస్ నెరవేర్చింది. అలాగే సంగారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ గత నాలుగున్నరేండ్లలో రూ.4,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. అందోలు నియోజకవర్గంలో రైతులకు సింగూరు ద్వారా సాగునీరు ఇవ్వటంతోపాటు సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల ద్వారా 2 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నది. పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ వేలకోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు భారీఎత్తున పరిశ్రమలకు తీసుకువచ్చి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించింది. నారాయణఖేడ్ నియోజకవర్గంలో మారుమూల తండాలు మొదలుకుని నారాయణఖేడ్ పట్టణం అభివృద్ధికి ప్రభుత్వం రూ.2వేలకోట్లకుపైగా నిధులు ఖర్చు చేసింది. బసవేశ్వర ఎత్తిపోతలతో నారాయణఖేడ్ సస్యశ్యామలం కానున్నది. జహీరాబాద్ నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు నిమ్జ్‌లో వేలకోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటయ్యేలా బీఆర్ఎస్ ప్రభుత్వం పాటుపడింది. సంగారెడ్డి జిల్లా అభివృద్ధికి పాటుపడిన బీఆర్ఎస్‌కు మరోమారు అవకాశం ఇస్తే జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజలు అనుకుంటున్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ వైపు ఓటర్లు మొగ్గు చూపుతున్నారు.

## కాంగ్రెస్‌కు మద్దతిస్తే కష్టాలు తప్పవంటున్న ప్రజలు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రచేస్తున్నారు. అయితే ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. కాంగ్రెస్ అత్యధిక కాలం అధికారంలో ఉంది. కాంగ్రెస్ పాలన అంటే జిల్లా ప్రజలకు తాగునీటి కటకట, కరెంటు కష్టాలు, వలసలు, రైతు ఆత్మహత్యలు గుర్తుకు వస్తున్నాయి. జిల్లాను ఏనాడూ అభివృద్ధి చేయని, సంక్షేమాన్ని పట్టించుకోని కాంగ్రెస్‌కు ఎందుకు మద్దతుఇవ్వాలని ఓటర్లు ఆలోచిస్తున్నారు. కాంగ్రెస్‌కు మద్దతిస్తే తిరిగి కరెంటు కష్టాలు, తాగునీరు, సాగునీటి కష్టాలు తప్పవని ప్రజలు నమ్ముతున్నారు. దీంతో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులపైనా ప్రజల్లో అసంతృప్తి బాగా ఉంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు తప్పుడు హామీలు, వాగ్దానాలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, తమను గెలిపిస్తే పెద్ద పదవులు వస్తాయని తద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎవరికివారే ఓటర్లను మభ్యపెడుతున్నారు. దీనికితోడు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు మద్యం, డబ్బులు ఎరగా వేసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారు. అయితే ఓటర్లు కాంగ్రెస్ కుటిలరాజకీయాలను తిప్పకొడతారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

### ధరణి తీసివేస్తే పట్టాదారుడికి ఇబ్బందులే..



కాంగ్రెస్ మరోసారి తెలంగాణలో అధికారం కోసం వెంపర్లడుతున్నది. ధరణిని తీసేస్తామని, దాని స్థానంలో భూమాతను ప్రవేశపెడుతామని చెబుతుంన్నది. ధరణి చాలా సౌలభ్యకరంగా ఉంది. కేవలం నిమిషాల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ పనులు పూర్తవుతున్నాయి. గతంలో రిజిస్ట్రేషన్ కోసం నారాయణఖేడ్ సబ్‌రిజిస్టార్ కార్యాలయానికి తరిలివెళ్లేవాళ్లం. అక్కడ రిజిస్ట్రేసన్ కోసం గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి. ఆపై మ్యూటేషన్ కోసం తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగేటోళ్లం. అప్పట్లో ఉన్న వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్లు మ్యూటేషన్ కోసం చాలా ఇబ్బంది పెట్టేవారు. వారికి ముడుపులు చెల్లించి మ్యూటేషన్ చేసుకున్నాం. నెలల తరబడి కూడా మ్యూటేషన్ అయ్యేది కాదు. ఇప్పుడు అలా కాకుండా రిజిస్ట్రేషన్ రోజునే మ్యూటేషన్ అయిపోతుంది. ఇప్పుడు కొత్తగా కాంగ్రెస్ వాళ్లు కౌలుదారు కోసం ప్రవేశపెడుతున్నామని చెబుతున్నారు. దీంతో అసలు పట్టాదారు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

– పుల్‌సింగ్‌నాయక్, బోర్గితండా, కంగ్టి మండలం

### ధరణి లేకుంటే అధికారుల ఇష్టారాజ్యం..



కాంగ్రెస్‌కు ఓటేస్తే రెవెన్యూలో అధికారుల ఇష్టారాజ్యం అవినీతి పెరుగుతుంది. అటు ఆఫీసర్లకు, దళారులకు రైతులు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రైతులు కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగి సమస్యల సుడిగుండంలో పడిపోతారు. కాంగ్రెస్ ఇస్తున్న హామీలు రైతుల పొట్టకొట్టేలా ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ధరణితో రైతులకు ఎంతోమేలు జరిగింది. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ఓటు వేస్తే ధరణిని రద్దు చేసి పాత రెవెన్యూ విధానాన్ని తీసుకురావడం రైతులకు అవమానపర్చడమే.. రెవెన్యూ రికార్డులను మరిస్తే పట్టాదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ధరణిని తీసేసి కొత్తగా ఏది తెచ్చినా భూరికార్డుల్లో తప్పులోస్తాయి. ఒకరి భూమి మరొకరికి మరే అవకాశం ఉంది.

– కుత్బుద్దీన్, రైతు, మేళసంగం మునిపల్లి మండలం

### 10 హెచ్‌పీ మోటర్ అవసరమే లేదు



రాయికోడ్, నవంబర్ 29: వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్ అవసరమే లేదు. ఎకరాకు 3 గంటల కరెంట్ చాలు అని రేవంత్‌రెడ్డి మాట్లాడటం అయన అవివేకం. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్ధరాత్రి పొలానికి కరెంట్ వేసి వచ్చేటోళ్లం. నిద్ర ఉండేది కాదు. ఎరువులు టైంకు అందేటివి కావు. కాంగ్రెస్ హయాంలో శానాతిప్పలు చూసినం. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత రైతులకు ఎంతో మేలు చేస్తుండ్రు. రైతుబంధు, రైతు బీమా ఇచ్చి అదుకుంటుండ్రు. కాంగ్రెస్‌ని నమ్మితే కష్టాలు తప్పవు కేసీఆర్ సారే రైతులకు మేలు చేస్తారు. 24 గంటల కరెంట్ ఇయ్యటంలో రైతులకు చాలా మేలు కలుగుతుంది. మరోసారి కేసీఆర్‌యే సీఎం అయితడు. అయనకే ఓటేస్తం.

– విజేంద్రరెడ్డి, రాయికోడ్, మండలకేంద్రం

### ధరణి తీసేస్తే రైతులకు ఇబ్బందులు



రాయికోడ్, నవంబర్ 29: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి తీసేస్తే రెవెన్యూలో అవినీతి పెరుగుతుంది. అటు ఆఫీసర్లకు ఇటు దళారులకు రైతులు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి వస్తుంది. రైతులు కోర్టుల, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగి సమస్యల సుడిగుండంలో పడిపోతారు. కాంగ్రెస్ ఇస్తున్న హామీలు కౌలు రైతు ల పొట్ట కొట్టేలా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికలో ఓటు వేస్తే ధరణిని రద్దు చేసి పాత రెవెన్యూ చట్టన్ని తీసుకురావడం రైతులకు ఇబ్బందే. కేసీఆర్ సార్ ప్రభుత్వం రూ పొందించిన ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. కాంగ్రెసోళ్ల పాతపద్ధతిలో పట్వారీ వ్యవస్థను తీసుకురావాలని అనుకోవడం ప్రజలకు ఇబ్బుందుల్లో నెట్టడమే అవుతుంది. అప్పట్లో నెలల తరబడి కూడా మ్యూటేషన్ అయ్యేది కాదు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ రోజునే మ్యూటేషన్ అయిపోతుంది. ఇప్పుడు కొత్తగా కాంగ్రెస్ వాళ్లు కౌలుదారు కోసం ప్రవేశపెడుతున్నామని చెబుతున్నారు. దీంతో పట్టాదారు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

– మైహిబూబ్ పాటిల్, మామిడిపల్లి, రాయికోడ్ మండలం

### కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ సమస్యలు



కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే మళ్లీ కారెంట్ సమస్యను తెచ్చుకున్నట్లే. తెలంగాణ వస్తే కరెంట్ సమస్య వస్తుందని అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నాడు. కానీ, సీఎం కేసీఆర్ ఆరునెలల్లోనే కరెంట్ సమస్యను తీర్చి 24గంటలు సరఫరా చేస్తుండ్రు. కరెంట్ విషయంలో తెలంగాణ నంబర్‌వన్‌గా ఉంది. కాంగ్రెస్ హయాంలో పవర్ హాలిడేలు ఉండేవి. రోజులో మొత్తానికి 8 గంటలు కూడా సరిగ్గా కరెంట్ ఉండేది కాకుండే. ఎప్పుడు కరెంట్ పోతుందో తెలిసేది కాకుండే. కంపెనీలు బంద్ అయి కార్మికులు ఉద్యోగలు లేకుండా పోయాయి. అలాంటి పరిస్థితుల్లో నుంచి ఇప్పుడు తెలంగాణ కరెంట్ విషయంలో నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. పరిశ్రమలకు, రైతులకు, వాణిజ్యసంస్థలకు, గృహోపకరణాలకు 24గంటల నిరంతర కరెంట్ సరఫరా చేస్తుండడంతో కరెంట్ సమస్యలు తెలుస్త లేవు. పరిశ్రమలు మూడు షిఫ్టులు నడుస్తున్నాయి. కార్మికులకు ఓటీలు దొరుకుతున్నాయి. అందరూ సంతోషంగా బతుకుతున్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే అప్పటి రోజులకు తిరిగి తెచ్చుకున్నట్లు అవుతుంది. కాంగ్రెస్‌ను నమ్మో పరిస్థితి లేదు. బీఆర్ఎస్ వైపే నిలుస్తాం.

– రవికుమార్, రామచంద్రాపురం

# దీక్షా దివస్ చారిత్రాత్మకం

- నవంబర్ 29 కేసీఆర్ దీక్ష ఫలితమే తెలంగాణ రాష్ట్ర సాకారం
- దీక్షా దివస్‌లో భాగంగా రక్తదాన శిబిరం
- రంగధాంపల్లి వద్ద అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 29 : 'నవంబర్ 29 దీక్షా దివస్ అనేది ఒక చారిత్రాత్మక దినం.. కేసీఆర్ ఒక ఉద్యమకారుడుగా కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నివాదంతో దీక్షను చేపట్టిన రోజు' అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం దీక్షా దివస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని రంగధాంపల్లి అమరవీరుల స్తూపంవద్ద అమరులకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మం త్రి నివాసంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ దీక్షకు వెళ్లేటప్పుడు నా శవయాత్ర లేదా తెలంగాణ జైత్రయాత్రని ఆమరణ దీక్షకు కూర్చున్న రోజు నవంబర్ 29 అన్నారు. ఈ దీక్షకు సిద్దిపేటలోని రంగధాంపల్లి చౌరస్తా వేదికైందన్నారు. కేసీఆర్ చేపట్టిన దీక్ష యావత్ తెలంగాణ ప్రజలను కదిలించిందన్నారు. తెలంగాణను సాధించిందన్నారు. నవంబర్ 29 చరిత్రను మలుపుతిప్పిన రోజు అన్నారు. కరీంగనర్ నుంచి సిద్దిపేటలోని దీక్షాస్థలికి కేసీఆర్ వస్తుంటే అనాటి సీమాంధ్ర పాలకులు అలుగునూరు వద్ద పోలీసులు మోహరించి అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించినా, దీక్షను కొనసాగించారన్నారు. ఖమ్మం దవాఖానకు తీసుకెళ్లినా కేసీఆర్ తన దీక్షను కొనసాగించారని తెలిపారు. కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తుంటే అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. తన శరీరం సహకరించకున్నా దీక్షను కొనసాగించారన్నారు. కేసీఆర్ దీక్ష ఫలితంగా అనాటి కేంద్ర హోం మంత్రి చిదంబరం 2009 డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటన చేశారన్నారు. కేసీఆర్ దీక్ష చేయకపోతే ఈ రోజు తెలంగాణ వచ్చేది కాదన్నారు. మనం స్వేచ్ఛ వాయువులు పీల్చుకునే వాళ్లం కాదన్నారు. జయశంకర్ చెప్పిన ఉద్యమ ట్యాగ్‌లైన్ నీళ్లు, నిధులు, నియమాకాల కల నిజమయ్యేది కాదన్నారు. ఈ దీక్ష చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. దీక్షకు వేదికైన రంగధాంపల్లి వద్ద ఆచార్య జయశంకర్ చేతుల మీదుగా అమరవీరుల స్తూపం నిర్మించుకున్నామన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.